ఇంట్లోనే వైద్య పరీక్షలు

- అందుబాటులో ఆధునిక వైద్య పరికరాలు
- సులువుగా వ్యాధి నిర్ధారణ
- సమయం, డబ్బు ఆదా



షుగర్ బాధితుల కోసం గ్లూకోమీటర్



ఎలక్ట్రానిక్ బీపీ మీటర్



గర్భనిర్ధారణ పరీక్ష కిట్



భద్రాచలంఅర్బన్: ఆధునిక వైద్య విజ్ఞానం అందుబాటులోకి రావడంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు చేరువయ్యాయి. బీపీ, షుగర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులకు ప్రతి రోజూ పరీక్షలు అవసరం అవుతాయి. వాటి నిర్ధారణ కోసం క్లినిక్‌కు పరుగులు తీసే పని లేకుండా ఇంట్లోనే వ్యాధి నిర్ధారణ చేసుకునే ఆధునిక వైద్య పరికరాలు నేడు లభ్యమవుతున్నాయి. కచ్చితమైన వ్యాధి నిర్ధారణతో పాటు కొన్ని నిమిషాల వ్యవధిలోనే వ్యాధి నిర్ధారణ జరుగుతోంది. ఫలితంగా రోగులు ఆగమేఘాల మీద ఆస్పత్రులకు పరుగులు తీయాల్సిన అవసరం ఉండదు. అక్కడకు వెళ్లి వేచి చూడాల్సిన పని ఉండదు. సమయం, డబ్బు ఆదా అవుతాయి.

ఎలక్ట్రానిక్ బీపీ మీటర్లు..

రోజు రోజుకూ బీపీ బాధితుల సంఖ్య అధికమవుతోంది. ప్రతి రోజూ బీపీ ఎంతుందో తెలుసుకుని బీపీ నియంత్రణ కోసం మందులు వాడాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఇంట్లోనే పరీక్ష చేసుకునేందుకు ఎలక్ట్రానిక్ బీపీ ఆపరేటర్లు మార్కెట్‌లో లభిస్తున్నాయి. ఆపరేటర్ స్విచ్ ఆన్ చేయగానే ఒక్క నిమిషంలోనే రక్తపోటు, గుండె కొట్టుకునే వేగం కూడా తెలిసి పోతుంది.

షుగర్ బాధితుల కోసం..

దీర్ఘకాలిక వ్యాధి మధుమేహం. ప్రతి రోజు రక్తంలో షుగర్ శాతం తెలుసుకుని దానిని అదుపులో పెట్టుకోవాలి. ఇందుకోసం ఆధునిక గ్లూకోమీటర్లు మార్కెట్‌లో లభిస్తున్నాయి. వీటి సహాయంతో కేవలం సెకన్ల వ్యవధిలోనే రక్తంలో షుగర్ లెవల్స్ తెలుసుకోవచ్చు. ఒక్క చుక్క రక్తంతోనే షుగర్ తెలుసుకోవచ్చు.

ఆస్తమా బాధితుల కోసం..

చలికాలంలో రోగులను బాగా వేధించే సమస్య ఆస్తమా. పిల్లలు, వృద్ధులు ఎంతో ఇబ్బంది పడిపోతారు. రాత్రి వేళల్లో నిద్రపోయేందుకు చాలా ఇబ్బందిగా ఉంటుంది. వీరు ఇంట్లోనే ఉండి ఊపిరితిత్తుల్లో ఉన్న ఇన్ఫెక్షన్‌ను తగ్గించేందుకు నెబిలైజర్ వైద్య పరికరం ఉపయోగపడుతున్నాయి.

పడకపై ఉండే బాధితుల కోసం..

పక్షవాతం వచ్చి నడవలేకుండా మంచానికే పరిమితమయ్యే వారికి, రోడ్డు ప్రమాదాల్లో గాయపడి వెన్నుపూస దెబ్బతిని మంచం దిగలేని వారి కోసం నేడు ఆధునిక వీల్ చైర్స్ అందుబాటులోకి వచ్చాయి. వీటిల్లో మల, మూత్రాలను పట్టేందుకు కింద భాగంలో చిన్న బకెట్లు అమర్చుతారు. వాటిని వినియోగించిన ఆపై శుభ్రం చేసి పెట్టవచ్చు.

గర్భనిర్ధారణ పరీక్ష..

గర్భం వచ్చిందా లేదా అని నిర్ధారణ చేసే పరీక్షను ఇళ్ల వద్దే చేసుకోవచ్చు. వన్ సెటప్ ప్రెగ్నెన్సీ టెస్ట్ డివైస్ ద్వారా ఈ పరీక్ష చాలా సులువుగా చేయవచ్చు. యూరిన్‌ను ఒక చుక్క స్ట్రిప్‌పై వేస్తే దానిపై ఎరర్రగీత ఒకటి కనిపిస్తే గర్భం రానట్టు లెక్క. రెండు ఎర్రటి గీతలు కనిపిస్తే గర్భం వచ్చినట్లు.

ప్రజల్లో అవగాహన పెరిగింది..



బీపీ, షుగర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెరిగింది. బాధితులకు తరచుగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించాల్సి ఉంది. ఆధునిక వైద్య పరికరాలు గతంలో లేకపోవటం, ఉన్నా ప్రజలకు అవగాహన అంతగా లేకపోవటంతో ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపిస్తూ డిజిటల్ వైద్య పరికరాలను కొనుగోలు చేస్తున్నారు.

– డాక్టర్ సీతారామరాజు, మధుమేహ నిపుణుడు, భద్రాచలం

పర్యవేక్షణ తప్పనిసరి



బీపీ, షుగర్ లాంటి జబ్బులకు ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి రావటం చాలా శుభపరిణామం. రోగులు ప్రతి రోజూ ఈ పరీక్షలు చేయించుకోవాలి కాబట్టి ఇంటి వద్దే కొన్ని నిమిషాల వ్యవధిలో రిపోర్ట్ తెలుసుకునేలా అవకాశం ఉంది. అయితే అప్పుడప్పుడు దీర్ఘకాలిక రోగులు వైద్యులను సంప్రదించి వారి పర్యవేక్షణలో మందులు వాడాలి.

– డాక్టర్ రామకృష్ణ, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, భద్రాచలం

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. శనివారం గుట్టమల్లారంలోని మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సంస్థాగత ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ కార్యకర్త ప్రజలతో మమేకం కావాలని, 14 పంచాయతీలు, 11 ఎంపీటీసీ స్థానాలు, 1 జెడ్పీటీసీ స్థానాన్ని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.నవీన్, కాటబోయిన నాగేశ్వరరావు, శివ, తరుణ్‌రెడ్డి, సౌజన్య, గుండగాని నాగేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం కూనవరం పంచాయతీలోని ఎన్‌టీఆర్ నగర్‌లో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి భూమి పూజ చేసి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేశ్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ స్వర్ణజ్యోతి, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రజాభవన్‌లో రూ.లక్షా పదివేల సీఎంఆర్ఎఫ్ చెక్కును లబ్ధిదారుడి బెల్ల సత్యనారాయణకు అందజేశారు. అశోక్‌నగర్‌కి చెంది కాంగ్రెస్ పార్టీ మహిళా కార్యకర్త దొడ్డి సీత అనారోగ్యంతో బాధపడుతుండగా.. ఆమెను పరామర్శించి ఆరోగ్య బాగోగులు అడిగి తెలుసుకున్నారు.

మండలంలో ఎమ్మెల్యే పర్యటన

దమ్మపేట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సుడిగాలి పర్యటన చేశారు. శనివారం మండలంలోని లంకాలపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే జారే చేతుల మీదుగా పలువురు కాంగ్రెస్ నాయకుల సమక్షంలో అందజేశారు. అంకంపాలెం గ్రామంలో అనారోగ్యంతో మరణించిన కూరం గంగులు భౌతిక కాయానికి పూలమాలతో నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమాల్లో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కాకా రమేష్, స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

అర్హులందరికీ రేషన్ కార్డులు

ములకలపల్లి: కాంగ్రెస్ పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ స్పష్టం చేశారు. నూతనంగా మంజూరైన పలువురు లబ్ధిదారులకు శనివారం ఎమ్మెల్యే రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్నోఏళ్ల కలలను సాకారం చేస్తున్న ఘనత తమ పార్టీకే దక్కుతుందని అన్నారు. తహసీల్దార్ భూక్యా గనియా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, పర్వతనేని అమర్‌నాథ్, పువ్వాల మంగపతి, కారం సుధీర్, గాడి తిరుపతిరెడ్డి, కరుటూరి కృష్ణ, సురభి రాజేశ్, శనగపాటి రవి, మిరియాల అవినాష్, పాలకుర్తి సుమిత్ తదితరులు పాల్గొన్నారు.

తొట్టిపంపులో వైద్యశిబిరం

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలంలోని తొట్టిపంపు గ్రామంలో ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు రక్తపరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, ఎంపీడీఓ కావూరి మహాలక్ష్మి, వైద్యసిబ్బంది ప్రకాష్‌రావు, జయలక్ష్మి, దుర్గాభవాని, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బంద్‌ను జయప్రదం చేయాలి


సమావేశంలో నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కరకగూడెం: రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 23వ తేదీన జరిగే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి మదాసు అఖిల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శనివారం పినపాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి సుమారు 20 నెలలు కావస్తున్నా ఇంతవరకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలను విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశం అనంతరం ఎస్ఎఫ్ఐ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలు గుంటుపల్లి ఉదయశ్రీ, కార్యదర్శిగా పూజెం కాంత్ కుమార్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా చర్ప ఓంకార్, బానోత్ లతశ్రీ, నూనె శ్రీనికేతన్, సంతుకూరి హర్షితలు ఎన్నికయ్యారు. నాయకులు రేగుళ్ల హరీష్, బోడ అఖిల్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం


సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాజేందర్

చంద్రుగొండ: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఈ కార్యంలో భాగస్వాములపైన కేసులు నమోదవుతాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.రాజేందర్ తెలిపారు. మండలంలోని తిప్పనపల్లి పంచాయితీ మహ్మద్‌నగర్ గ్రామంలో శనివారం బాల్యవివాహాలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. బాల్యవివాహాలు జరిపించి ముక్కుపచ్చలారని పసివారి జీవితాలు నాశనం చేయొద్దని ఆయన సూచించారు. అలాంటి వివాహాలు చేసే తల్లిదండ్రులు, పురోహితులు, ఖాజీలు, వివాహానికి హాజరై భోజనం చేసే వారిపై సైతం చట్టరీత్యా కేసులు బుక్ చేయవచ్చని తెలిపారు. తమిళనాడులో ఇటీవలే బాల్యవివాహానికి హాజరైన 480 మందిపై కేసు నమోదైందని ఆయన ఉదహరించారు. మైనర్ పిల్లలపై లైంగిక వేధింపులు, గృహహింస చట్టంపై ఆయన అవగాహన కల్పించారు. పిల్లలు లేని వారు దత్తత తీసుకోవాలనుకుంటే చట్టం నిబంధనల ప్రకారం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. బాల్య వివాహాలపై అవగాహన కోసం గ్రామంలోని ఇంటింటికి తిరిగి పోస్టర్లు అంటించారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యుడు ఎండీ సాదిక్‌పాష, ఉమెన్ వెల్ఫేర్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, 1098 కోఆర్డినేటర్ సందీప్, డీసీపీ సెక్షన్ అధికారి శేషు అంగన్‌వాడి కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ విడుదల చేయాలని ధర్నా


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మణుగూరురూరల్: విద్యార్థులకు పెండింగ్ స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వి.అజిత్ మాట్లాడుతూ.. పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి శ్రీకారం చుడితే.. నేటి అధికారంలో ఉన్న అదే కాంగ్రెస్ ప్రభుత్వం పథకాన్ని నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని మానుకొని పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలన్నారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ అద్దంకి నరేష్‌కు అందజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు ఈనపల్లి పవన్‌సాయి, అక్కినపల్లి నాగేంద్రబాబు, మండల నాయకులు ఇరుగు నవీన్, పవన్‌కల్యాణ్, నాసర్, షబ్బీర్, రవి వర్మ, యశ్వంత్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం

అన్నపురెడ్డిపల్లి(చంంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న బాలాజీ వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో పండితుల వేదమంత్రోత్సరణలతో కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. ఏర్పాట్లను ఆలయ ఇన్‌చార్జ్ మేనేజర్ పీవీ.రమణ పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

వాహనాల తనిఖీ


మొండికుంటలో ఆర్టీసీ డ్రైవర్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న ఎస్సై మధుప్రసాద్

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో ఎస్సై మధుప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేశారు. ఆర్టీసీ డ్రైవర్లకు కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మధుప్రసాద్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగి ఎందరో ప్రాణాలు కోల్పోయి ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులు లేదా వాహన యజమానిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు.

కస్తూర్బాలో స్పాట్ అడ్మిషన్లు

ములకలపల్లి: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) రేపు (సోమవారం) చేపట్టబోయే స్పాట్ అడ్మిషన్లను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఓ మహేశ్వరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతితోపాటు సీఈసీ ప్రథమ సంవత్సరంలో సీట్లు ఖాళీగా ఉన్నాయని, కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రగాయాలైన ఘటన శనివారం మండలంలో జరిగింది. నారంవారిగూడెం కాలనీ గ్రామానికి చెందిన దేవరపల్లి వెంకన్న ద్విచక్ర వాహనంపై అశ్వారావుపేట నుంచి తన స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో మరో ద్విచక్రవాహనదారుడు ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. వెంకన్న ఎడమ కాలు విరిగిపోయింది. స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించి.. ఆపై మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

ఖాళీ సంచే హెచ్చరిక!


గొయ్యి పడిన ప్రదేశంలో కర్రకు హెచ్చరిక సూచికగా ఉంచిన ఖాళీ సంచి

అశ్వారావుపేటరూరల్: నిత్యం వాహనాలు సంచరించే ఓ ప్రధాన రహదారిపై పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. అశ్వారావుపేట మండలం గాండ్రాల నుంచి గాండ్రాల స్టేజీ వైపు వెళ్లే మార్గమధ్యలో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో బీటీ రహదారి అప్రోచ్‌కు అడుగు వెడల్పు, సుమారు ఐదు అడుగుల లోతులో బుంగ పడింది. ఈ బుంగ గొయ్యి కాలినడక, వాహనదారులు దగ్గరకు వచ్చే దాకా కనిపించడం లేదు. దీన్ని గమనించిన ఓ బాటసారి ఆ గొయ్యి వద్ద కర్రకు ఖాళీ సంచిను హెచ్చరిక సూచికగా పెట్టాడు.

నీట్ ర్యాంకర్‌కు సన్మానం

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో ఎంబీబీఎస్ సీటు సాధించిన మండలంలోని రాజాపురం గ్రామానికి చెందిన కంచు హరిప్రియను శనివారం కురమసంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ.. సంఘం ఆధ్వర్యంలో హరిప్రియకు ఆర్థిక చేయుత అందేలా కృషి చేస్తామన్నారు. నాయకులు చిన్నం రామకృష్ణ, చేగూరి వేణు, కంచు రామకృష్ణ, వెంకటేశ్వరరావు, వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు.

హలో.. ఎలా ఉన్నారు?

- గురుకులాల్లో నూతనంగా 'ఫోన్‌మిత్ర' సేవలు
- కుటుంబికులతో విద్యార్థులు మాట్లాడుకునే అవకాశం
- 'హోంసిక్' లేకుండా ఏర్పాటు


గురుకులంలోని ఫోన్ల ద్వారా తల్లిదండ్రులతో మాట్లాడుతున్న విద్యార్థినులు

ములకలపల్లి: 'హలో అమ్మా ఎలా ఉన్నారు. నాన్న ఏం చేస్తున్నారు?' అంటూ గురుకుల విద్యార్థులు ఫోన్లో తమ వారితో మాట్లాడుతున్నారు. ఆరోగ్య వివరాలు, యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాల్లో ఈ యేడాది నూతనంగా ఏర్పాటు చేసిన 'ఫోన్‌మిత్ర' ద్వారా ఇలా మాట్లాడడం సాధ్యమవుతోంది. పిల్లలకు, వారి తల్లిదండ్రులకు దూరం దగ్గింది. దీంతో చిన్నారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలల్లో ఈ దాది నూతనంగా ఫోన్‌మిత్ర సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీనిద్వారా విద్యార్థులు తమ తల్లిదండ్రులు, కుటుంబీకులతో మాట్లాడుకునే అవకాశం దక్కింది. పాఠశాల ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫోన్ల ద్వారా ప్రతీ రోజూ తమవారితో మాట్లాడుకోవచ్చు. దీంతో ఇంటి నుంచి దూరంగా ఉన్నామనే భావన పిల్లల్లో కొంతమేరకు తొలగినట్టైంది. తద్వారా చక్కటి వాతావరణంలో విద్యపై మనసు నిలిపేందుకు వీలు కల్పించినట్టైంది.

ప్రత్యేక కార్డులు జారీ..

ఫోన్‌మిత్ర ద్వారా ప్రతీ విద్యార్థి రోజూ 6 నిముషాలపాటు తమ వారితో ఫోన్లో మట్లాడవచ్చు, ఇందుకుగాను ప్రత్యేకంగా కార్డులు జారీ చేశారు. నలుగురు విద్యార్థులకు కలిసి ఓ కార్డు ఇచ్చారు. దీంతో రోజులో 25 నిముషాలు ఫోన్లో సంభాషించవచ్చు. అంటే ఒకే కార్డు ద్వారా నలుగురు విద్యార్థులు ఒక్కొక్కరు ఆరు నిముషాల వ్యవధి మాట్లాడవచ్చు. మరునాడు మరలా అదే కార్డులో 25 నిముషాలు మాట్లాడుతుకునే వీలుంటుంది. అయితే విద్యార్థులకు సరిపడా ఫోన్లు లేకపోవడంతో ప్రత్యేకంగా ప్రణాళిక తయారు చేశారు. ప్రతీ తరగతికి వారానికి ఒకరోజు మాట్లాడేలా రూపొందించారు. పాఠశాల తరగతి వేళల మినహా. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో ఫోన్లో మాట్లాడవచ్చు.

గతంలో ఇలా..

గతంలో ఈ పాఠశాలకు వచ్చే విద్యార్థులకు తమ వారితో మాట్లాడే అవకాశం ఉండేది కాదు. ఫోన్ చేసేందుకు ఎటువంటి వీలు లేకపోవడంతో చిన్నారులు విలవిలలాడేవారు. పాఠశాల సెలవుల్లో ఇంటికి చేరే వరకూ తమవారి మాట కూడా వినే అవకాశం లేకపోవడంతో అల్లాడిపోయేవారు. ఇప్పుడీ ఫోన్‌మిత్ర ద్వారా మార్గం దొరకడంతో హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

ఆనందంగా ఉంది..



ఫోన్ ద్వారా మా వాళ్లతో మాట్లాడం చాలా ఆనందంగా ఉంది. దీంతో అయినవాళ్లకు దూరంగా ఉన్నామనే భావనే లేదు. దీంతో చక్కగా చదువుకునేందుకు ఇదెంతో దోహదపడుతోంది.

– రోహిణీ ప్రియ, 5వ తరగతి

ప్రత్యేక కృతజ్ఞతలు..



మా పరిస్థితిని అర్థం చేసుకొని ఫోన్‌మిత్ర ఏర్పాటు చేయడం చాలా సంతోషాన్నిచ్చింది. హాస్టల్ విద్యార్థులకు నిజంగా ఇదో వరం లాంటిది. అధికారులకు కృతజ్ఞతలు.

– నందిత, 5వ తరగతి

ఆ భావన తొలగించేందుకే..



విద్యార్థులు తమ వారి నుంచి దూరమయ్యామనే భావన తొలగించేందుకు ఫోన్‌మిత్రను ఏర్పాటు చేశారు. గురుకులాల కార్యదర్శి వర్షిణి ప్రత్యేక చొరవతో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

– సునీత, ప్రిన్సిపాల్, టీఎస్‌డబ్ల్యూఆర్, ములకలపల్లి

క్లుప్తంగా

అంతర పంటలు సాగు చేయండి

అశ్వారావుపేటరూరల్: పామాయిల్, కొబ్బరి తోటల్లో అంతర పంటలుగా కోకో, వక్క, మునగ సాగు చేయాలని మండల ఉద్యాన శాఖ అధికారి వేణుమాధవ్ సూచించారు. శనివారం మండలంలోని పండువారిగూడెం గ్రామంలో జీవా ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో వాసన్ సంస్థ పర్యవేక్షణ, నాబార్డు సహకారంతో సంప్రదాయ పంటలను సాగు చేసే రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఓ మాట్లాడుతూ.. వక్క, కోకో పంటలకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, మునగ పంటకు స్థానికంగా సానుకూలత ఉన్న నేపథ్యంలో రైతులు వీటిని అంతర పంటలుగా సాగు చేసి అదనపు ఆదాయాన్ని, సబ్సిడీని పొందాలన్నారు. కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, వూకే మల్లయ్య, జయమ్మ, రాములమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

అర్హతకు మించి వైద్యం చేస్తే చర్యలు

దుమ్ముగూడెం: ఆర్ఎంపీలు అర్హతకు మించి వైద్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దుమ్ముగూడెం పీహెచ్‌సీ డాక్టర్ రుక్మాకర్ రెడ్డి హెచ్చరించారు. శనివారం పీహెచ్‌సి పరిధిలోని లక్ష్మీనగరం గ్రామంలో ఉన్న ఆర్ఎంపీ వైద్యశాలలను, రక్తపరీక్ష కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజన్‌లో వచ్చే జ్వరాలు, ఇతర రోగులకు రక్త పరీక్షల పేరున దోపిడీ చేస్తే సంబంధిత కేంద్రాలను, అనుమతి లేని ఆర్ఎంపీ కేంద్రాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, ప్లేట్‌లెట్స్ తదితర పరీక్షలు పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. హెల్త్ అసిస్టెంట్స్ గంగాధర్ గౌడ్, ధర్మయ్య పాల్గొన్నారు.

సివిక్ యాక్షన్ ప్రోగ్రాం

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా కిష్టారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న తుంబవాగు గ్రామంలో సీఆర్పీఎఫ్ అధికారులు సివిక్ యాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ప్రజాసంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామస్తులకు అవసరమైన రేడియోలు అందజేసి వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు అందజేశారు. 217 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ కిరణ్ కుమార్, 217/ఏ అసిస్టెంట్ కమాండెంట్ అనిల్ పాటిల్, 217 బెటాలియన్ సీఆర్పీఎఫ్ రెండో కమాండ్ నిర్‌సింగ్ మీనా, అసిస్టెంట్ కమాండెంట్ కిరణ్ కుమార్, సీఆర్పీఎఫ్ జవాన్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోనాల వేడుకలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని త్రివేణి పాఠశాలలో సాంప్రదాయ బోనాల సంబురాలను శనివారం ఘనంగా నిర్వహించారు. బోనాల పండుగ విశిష్టతను తెలియజేయడానికి విద్యార్థులకు అమ్మవారితో పాటు పోతురాజు వేషధారణలో అలరించారు. పాఠశాల ఆవరణలో వివిధ రకాల పండ్లు కూరగాయలతో అమ్మవారిని శాకాంబరీ దేవిగా అలంకరించి బోనాల సంబరాలు చేశారు. ప్రిన్సిపాల్ నిరుపమ, ఏఓ బాబురావు, వైస్ ప్రిన్సిపాల్ విమల దేవి, అకాడమిక్ ఇన్‌చార్జ్ నరేష్, క్యాంపస్ ఇన్‌చార్జ్ సందీప్, సురేష్ పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండలంలోని బొంబాయికాలనీలో ఉన్న ఎక్స్‌లెంట్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శనివారం ముందస్తు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు బోనాలను సమర్పించడంతో పాటు పలువురు పోతురాజు వేషధారణలతో అలరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ భాను ఖాన్, కరస్పాండెంట్ జెఎం ఖాన్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూములు రక్షించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం సీతారామచంద్ర స్వామివారి దేవస్థాన భూముల రక్షణకు రెండు తెలుగు ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపాలని విశ్వహిందూ పరిషత్ ప్రచార ప్రముఖ్ పగుడాల బాలస్వామి శనివారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రాముడి పేరుపై ఉన్న భూముల రక్షణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రస్తుతం రాములవారి గోశాల ప్రహరీ గోడ నిర్మాణానికి అడ్డంకులు తొలగించడంతో పాటు నిర్మాణాన్ని అడ్డుకుంటున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పురుషోత్తపట్నంలోని రామయ్య భూములపై పూర్తి హక్కులు భద్రాద్రి దేవస్థానానికే చెందుతాయని స్పష్టం చేశారు. రామయ్య భూములను కాపాడేందుకు తమ సంస్థ భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తుందని ఆయన తెలిపారు.

24న పెన్షన్‌దారుల సదస్సు

భద్రాచలంటౌన్: పెన్షన్ల పెంపునకై ఈ నెల 24న జిల్లా కేంద్రంలో పెన్షన్ దారుల సమావేశం నిర్వహిస్తున్నట్లు మహాజన మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు మేకల లత తెలిపారు. స్థానిక ఆదర్శనగర్ కాలనీలో శనివారం జరిగిన మహాజన మహిళా సమైక్య మండల కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జిల్లా పెన్షన్ దారుల సన్నాహక జిల్లా సదస్సు ముఖ్యఅతిథిగా సామాజిక ఉద్యమ పరివర్తకులు మంద కృష్ణ మాదిగ హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో కృష్ణవేణి, మంగ, రావుల నిర్మలమ్మ, కోట ప్రసన్న, కళావతి, రమణ, దుర్గ, నాగమణి, దుర్గ, సంపతి తదితరులు పాల్గొన్నారు.